# దసరాలోపు మూడు డీఏలు ఇవ్వాలి

- లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం..
- ఆరు గ్యారెంటీలతో ప్రజలు, ఉద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నాయకులు

ఖలీల్‌వాడీ, జూన్ 7: దసరాలోపు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏల్లో మూడు డీఏలు ఇవ్వకపోతే ఉద్యోగుల పక్షాన ఉద్యమిస్తామని ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. వెంటనే పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను ఆశపెట్టి, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నాయకులు శనివారం నిజామాబాద్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ కవితతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు ఇవ్వడంతో పాటు డీఏలు ఎప్పటికప్పుడు చెల్లిస్తామని, పీఆర్సీ ద్వారా మెరుగైన ఫిట్‌మెంట్ ఇస్తామనే హామీలతో పాటు ఉద్యోగులకు ఎన్నో వాగ్దానాలు చేసిందని తెలిపారు. ఏ ఒక్క హామీని నిలబెట్టుకోకపోగా ఉద్యోగులకు ఐదు డీఏలను పెండింగ్‌లో పెట్టి వారిని ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. జూలై ఒకటిన చెల్లించాల్సిన మరో డీఏను కలుపుకుంటే మొత్తం ఆరు డీఏలను ఈ ప్రభుత్వం బాకీ పడిందన్నారు. ఇప్పుడు ఒక జీవో, ఆరునెలల తర్వాత ఇంకో జీవో ఇస్తామని ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం అంటే ఉద్యోగులను వంచించడమే అవుతుందన్నారు. ఆరు గ్యారెంటీలతో సామాన్య ప్రజలను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఉద్యోగులను కూడా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా పీఆర్సీ వేయలేదన్నారు. కనీసం మధ్యంతర భృతి ఇచ్చే ప్రయత్నం చేయకపోగా ఉద్యోగులను నిందించేలా ప్రభుత్వం మాట్లాడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ కవితను కలిసిన వారిలో తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ రెండు జిల్లాల అధ్యక్షులు నాగరాజు, రేవంత్ తదితరులు ఉన్నారు.

## ముగ్గురు ఓసీ, ఒకరు ఎస్సీ

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, మదన్ మోహన్ రావు ముగ్గురు ఓసీలు ఉన్నారు. జుక్కల్ ఎమ్మెల్యే ఒక్కరే ఎస్సీ వర్గానికి చెందిన వారున్నారు. బీసీలెవరూ కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా లేరు. బీసీ సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్సీగా ఉన్న బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తుతం పీసీసీ చీఫ్‌గా కొనసాగుతున్నారు. ఈ పరిస్థితుల్లో క్యాబినెట్‌లో ఈయనకు చోటు దక్కడం కష్టమే. మొదట్లో మంత్రి పదవి విస్తరణలో మహేశ్‌కుమార్ గౌడ్ పేరు బలంగా వినిపించింది. కానిప్పుడు పార్టీ పదవి దక్కడంతో మంత్రి పదవి రేసులో పీసీసీ చీఫ్ వెనక్కి తగ్గినట్లుగా తెలుస్తోంది. సామాజిక సమీకరణాల నేపథ్యంలో ఎస్సీలకు ప్రాతినిధ్యం కల్పిస్తే తనకు చోటివ్వాలంటూ మొదటి సారి ఎన్నికల్లో గెలిచిన జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ప్రయత్నాలు చేసి మిన్నకుండిపోయారు. తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన మదన్ మోహన్ రావు, భూపతి రెడ్డి సైతం తమకున్న పరిచయాలతో ఏఐసీసీ స్థాయిలో పైరవీలు చేశారు. మంత్రి వర్గంలో చోటు దక్కడం మాత్రం వీరికి కష్టంగా మారింది. ఉమ్మడి జిల్లా నుంచి సుదర్శన్ రెడ్డి పేరు బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో ఏం జరుగుతుందో కొన్నిగంటల పాటు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- నేడు మంత్రివర్గ విస్తరణకు అవకాశం
- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల్లో తీవ్ర ఉత్కంఠ
- సుదర్శన్ రెడ్డికి ఖాయమంటూ ఊహాగానాలు
- చివరి వరకూ ప్రయత్నాల్లో కొత్త శాసన సభ్యులు

..అను నేను అనేది ఎవరు?





# అమాత్యయోగం ఎవరికి!

నిజామాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై మరోసారి హడావుడి కనిపిస్తున్నది. ఆదివారం మధ్యాహ్నం రాజ్‌భవన్‌లో మంత్రుల ప్రమాణ స్వీకారం ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మంత్రిగా ప్రమాణం చేసే వారెవరనే దానిపై స్పష్టం లేదు. ఏఐసీసీ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించినప్పటికీ రేవంత్ రెడ్డి క్యాబినెట్‌లో చోటు దక్కించుకుంటున్నది ఎవరు? అనేది తేలడం లేదు.

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో సీనియర్ ఎమ్మెల్యేగా సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఖాయమంటూ రోజంతా ఊహాగానాలు వినిపిస్తున్నా అధికారికంగా వివరాలు వెల్లడి కాలేదు. ఇప్పటికే పలుమార్లు ప్రయత్నాలు చేసి విఫలం కావడం, మంత్రి వర్గ విస్తరణ అనేక సార్లు వాయిదా పడడంతో ఏఐసీసీ పెద్దల ఆశీర్వాదం ఎవరికి లభించిందన్న విషయాన్ని ఎవరూ బయటికి చెప్పడంలేదు.

సామాజిక సమీకరణాల నేపథ్యంలో వివిధ వర్గాల ఎమ్మెల్యేలు భారీ స్థాయిలో ప్రయత్నాలు చేస్తుండడంతో ఉత్కంఠ కొనసాగుతోంది. సుదర్శన్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి గట్టిగానే పట్టుబడుతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. చివరి దాకా రాజ్‌భవన్ మెట్లు ఎక్కి ప్రమాణం చేసేది ఎవరు అన్నది మరికొద్ది గంటల్లో తేలనున్నది.

### 18 నెలలుగా ప్రాతినిధ్యం కరువు...

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 18నెలలు అవుతున్నా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి మంత్రి యోగం ఎవరికీ దక్కలేదు. మంత్రివర్గ విస్తరణపై పలుమార్లు లీకులు ఇచ్చి ఇదిగో అదిగో అంటూ ప్రచారం చేశారు. కానీ సామాజిక సమీకరణాలతో పాటు గ్రూపు తగాదాల నేపథ్యంలో అనేక సార్లు క్యాబినెట్ కూర్పు వాయిదా పడుతూ వస్తోంది. ఈసారి ఏఐసీసీ నుంచి అనుమతి లభించడంతో మంత్రి యోగం ముగ్గురు లేదా నలుగురికి దక్కనున్నదని జోరుగా ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం రేవంత్ టీమ్‌లో ఆరు మంత్రి పదవులను భర్తీ చేయాల్సి ఉంది. ఇందులో సామాజిక వర్గాల వారీగా ప్రాధాన్యం ఇస్తూ మంత్రి వర్గాన్ని భర్తీచేయాలని చూస్తున్నారు. రెడ్డి సామాజిక వర్గం నుంచి ఇప్పటికే చాలా మంది ఉన్నారు. ప్రస్తుతం అదే సామాజిక వర్గం నుంచి బోధన్ ఎమ్మెల్యే పోటీ పడుతున్నారు. ఈయనకు పోటీగా మల్‌రెడ్డి రంగారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తుండడం బోధన్ ఎమ్మెల్యేకు కాసింత ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితుల కారణంగానే బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతల్లో ఎలాంటి సంతోషం కనిపించడం లేదు. ఆదివారం ప్రమాణ స్వీకారం జరిగేంత వరకు ఎలాంటి హడావుడి చేయొద్దన్న ఆలోచనలో ఉన్నట్లుగా తెలుస్తోంది. చివరి క్షణం దాకా కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి మార్పులైనా జరిగే వీలుండడంతో కాంగ్రెస్ నేతలంతా మౌనంగానే ఉన్నారు.


# మొరం అక్రమ రవాణాను అడ్డుకోండి..



పోలీసులతో యువకుడి వాగ్వాదం

- మాక్లూర్ మండల ఆఫీస్ ఎదుట యువకుడి ఆందోళన
- రోడ్డుపై ఎడ్లబండి నిలిపి నిరసన

మాక్లూర్, జూన్ 7: మొరం అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరుతూ మండలంలోని గంగరమంద గ్రామానికి చెందిన సరికెల రాజు మండల కార్యాలయాల ఎదుట శనివారం ఆందోళన చేపట్టాడు. రోడ్డుపై ఎడ్ల బండిని నిలిపి నిరసన తెలిపాడు. గ్రామం నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్నారని, రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించాడు. గ్రామశివారులో గుట్ట నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మొరం తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని యువకుడిని సముదాయించారు. మొరం అక్రమ రవాణాపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. మొరం అక్రమంగా తరలిస్తున్నవారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడంతో యువకుడు శాంతించాడు.



## 'కాళేశ్వరం'పై ప్రజెంటేషన్

హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై శనివారం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ తదితరులు పాల్గొన్నారు.



## పంచాయతీ కార్యదర్శి అనుమానాస్పద మృతి!

- చిన్న కొడప్‌గల్ రెడ్డి చెరువులో మృతదేహం లభ్యం
- హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్న కుటుంబీకులు, పోలీసులు



కృష్ణ (ఫైల్)

పెద్ద కొడప్‌గల్ (పిట్లం), జూన్ 7: పిట్లం మండలం చిన్నకొడప్‌గల్ పంచాయతీ కార్యదర్శి ధారావత్ కృష్ణ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. చిన్నకొడప్‌గల్ చెరువులో మృతదేహం లభ్యంకాగా.. హత్యకు గురై ఉంటాడని కుటుంబీకులు, స్థానిక పోలీసులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. కుటుంబ సభ్యులు, ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలంలోని రూమ్ తండాకు చెందిన ధారావత్ కృష్ణ (28) మండలంలోని చిన్న కొడప్‌గల్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గురువారం రాత్రి 9.30 గంటల నుంచి కనిపించకుండా వెళ్లిన కృష్ణ శనివారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో చిన్న కొడప్‌గల్ రెడ్డి చెరువులో మృతదేహమై తేలాడు. విషయం తెలుసుకున్న బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి, సీఐ రాజశేఖర్, ఎస్సై రాజు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. తన కొడుకును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని తల్లి మీరిబాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించారు. హత్య చేసిన నిందితులను త్వరలో పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

# సబ్ స్టేషన్ ఎదుట రైతుల ధర్నా

### విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

పెద్ద కొడప్‌గల్, జూన్ 7: విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, జేఎల్‌ఎంను వెంటనే నియమించాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. మండలంలోని అల్లాపూర్ గ్రామ రైతులు పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. అల్లాపూర్ గ్రామంలో జేఎల్‌ఎం లేడని, నెలరోజులుగా విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నా ఏ అధికారిని అడిగినా స్పందించడంలేదన్నారు. బోరుబావుల వద్ద విద్యుత్ తీగల సమస్య ఏర్పడితే ఎల్‌సీ ఇవ్వాలని అడిగితే ఇవ్వడంలేదని, లైన్‌మన్‌కు చెప్పండి అంటూ సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కొన్నిచోట్ల 11 కేవీ విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉన్నాయని, కొన్ని స్తంభాలు వంగిపోయి ప్రమాదకరంగా మారాయని తెలిపారు. వారంలో రెండురోజులు విద్యుత్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రాత్రివేళలో నరకం అనుభవిస్తున్నామని వాపోయారు. విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే శాశ్వత జేఎల్‌ఎంను నియమించి, గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఏఈ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు అంబరెడ్డి, మార్గం పండరి, బుగ్గ రాములు, జక్కపూర్ అంబయ్య, అశోక్ రావు తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అల్లాపూర్ గ్రామ రైతులు



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

# భక్తిశ్రద్ధలతో బక్రీద్

### ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జూన్ 7 : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదినాన్ని ఉమ్మడి జిల్లాలో ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు అలాయ్ బలాయ్ తీసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. బక్రీద్ సందర్భంగా పేద ముస్లిం కుటుంబాలకు దాన, ధర్మాలు చేశారు. ముస్లింలకు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



జుక్కల్‌లో ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే